

(గత సంచిక తరువాయి)

31

ఆదివారం ఉదయం.

మొబైల్‌లోని అలారం మోగగానే ఆద్యకి మెలకువ వచ్చింది. తను వెళ్ళాల్సిన రోజు వచ్చిందనే ఆలోచన రాగానే కొద్దిసేపు కళ్ళు మూసుకుని పడుకుని తర్వాత ప్రశాంతంగా లేచి కిందకి వచ్చింది. చైత్ర ఇంకా లేవలేదు. ఈత దుస్తులు వేసుకుని వెళ్ళి కొద్దిసేపు ఈదింది. తర్వాత ఇంట్లోకి వచ్చింది.

చైత్ర సోఫాలో మొబైల్ చూసుకుంటూ కనపడగానే ఆనందంగా చెప్పింది.

"గుడ్‌మార్నింగ్ అక్కా! నాకు ఈత వచ్చేసింది! పద! చూపిస్తాను."

ఆద్య ఈతకొట్టడం చూసాక చైత్ర ఆనందంగా చెల్లెల్ని కౌగలించుకుని చెప్పింది.

"శభాష్! నాకన్నా త్వరగా నేర్చుకున్నావు."

"నిన్న రాత్రి నేను ఆఖరిసారి ప్రాక్టీస్ చేయాలనుకుని నీళ్ళల్లోకి వెళ్ళి చాలాసేపు ప్రాక్టీస్ చేసాను. అప్పుడే నువ్వు చెప్పిన ఆ క్షణం వచ్చింది.

తర్వాత చైత్ర మొబైల్‌ని చెక్ చేసి చెప్పింది.

"థాంక్ గాడ్! ఇసక తుఫానులేం లేవు. ఆక్రాకి విమానం షెడ్యూల్ ప్రకారం వెళ్తోంది. ఎందుకైనా మంచిదని టేక్సీలో పంపడానికి ఓ టేక్సీ కంపెనీతో మాట్లాడాను కూడా."

ఖాలెద్ వచ్చేదాకా కాఫీ తాగకుండా వేచి ఉన్నారు.

బ్రేక్‌ఫాస్ట్‌గా బియ్యపు పిండిలో పచ్చిమిర్చి, అల్లం, ఉల్లిపాయలు వేసి చేసిన రొట్టెని, బెల్లం నీరుతో ఏలకులు వేసి కలిపి చేసిన తీపి బియ్యం రొట్టెలని చేసారు.

"డెలీషియస్." ఖాలెద్ చెప్పాడు.

విమానంలో తినడానినికి చైత్ర అన్నం వండి పులిహోరని చేసింది.

"ఆమెకి ఇవ్వు." ఆద్యకి రెండువందల ఏభై సిడిలని ఇచ్చింది.

పని చేయడానికి వచ్చిన అనస్థాషియాకి దాన్నిచ్చి ఆద్య చెప్పింది.

"నీ పెళ్ళి త్వరగా జరగాలని దేవుడ్ని ప్రార్థిస్తాను."

ఆమె చాలా సంతోషించింది.

"ఆఖరిసారి చర్చ్‌కి వెళ్ళి పది నిమిషాల్లో వస్తాను." ఆద్య చెప్పింది.

చర్చ్‌లో ఓ ఐదేళ్ళ కుర్రాడికి బాప్టైజ్ చేసే కార్యక్రమం జరుగుతోంది. ఆ కుర్రాడిమీద పవిత్రజలం చల్లి, నెత్తిమీద చేతిని ఉంచి పాస్టర్ చెప్పాడు.

"యు ఆర్ ఏ చైల్డ్ ఆఫ్ గాడ్. సీల్డ్ బై ది స్పిరిట్ ఇన్ యువర్ బాప్టిజం అండ్ నౌ యు బిలాంగ్ టు జీసస్ క్రైస్ట్ ఫరెవర్. ఆమెన్!"

"ఆమెన్!" అంతా చెప్పారు.

ఆయన ఓ ప్రవచనాన్ని క్లుప్తంగా చెప్పాడు.

"మన జీవితాల్లో నిరాశలు, కష్టాలు, కన్నీళ్ళకి బాధ్యత ఎవరిది? ప్రపంచాన్ని నిందిస్తాం. అందుకు కారణంగా ఒకరిని నిర్ణయిస్తాం. కాని లా ఆఫ్ సీడ్‌ని అర్థం చేసుకుంటే మన లోపం మనకే అర్థమవుతుంది. ఏమిటా లా ఆఫ్ సీడ్? ఏపిల్ చెట్టుని మీరు ఎప్పుడైనా చూసారా? దానికి ఐదు వందల పళ్ళదాకా ఉంటాయి. ఏపిల్ పండులో దాదాపు పది విత్తనాలు ఉంటాయి కదా? అవన్నీ కలిపితే చాలా విత్తనాలు. కాని అన్ని ఏపిల్ చెట్లు ప్రపంచంలో మనకి కనపడవు. కొన్ని ఏపిల్ చెట్లకోసం దేవుడు అన్ని విత్తనాలు ఎందుకు ఇచ్చినట్లు? ఆ విత్తనాలన్నీ చెట్లు అవవని దేవుడికి తెలుసు. దీని ద్వారా ఏం బోధిస్తున్నాడు? జీవితంలో మనం అనుకున్నవన్నీ ఫలించవని, మీరు ఓ ఉద్యోగం సంపాదించాలంటే ఇరవై ఇంటర్వ్యూలకి హాజరవ్వాలి. ఓ ఫేక్టరీ యజమాని తనకి కావాల్సిన ఉద్యోగస్థుడ్ని అపాయింట్ చెయ్యడానికి ఇరవైమందిని ఇంటర్వ్యూ చెయ్యాలి. మీకున్న వందమంది పరిచయస్థుల్లో ఒక్కరే మీకు బెస్ట్ ఫ్రెండ్ అవుతారు. అందుకు వందమందితో పరిచయం తప్పనిసరని ఈ లా ఆఫ్ సీడ్ చెప్తోంది. దీన్ని మీరు సదా గుర్తుంచుకుంటే జీవితంలో మిమ్మల్ని ఏదీ నిరాశ పరచదు. మీరు బాధితులని అనుకోరు. మీకు కలిగే నిరాశలతో ఎలా వ్యవహరించాలో అప్పుడు మీకు తెలుస్తుంది. విజయవంతమైన మనుషులు ఎక్కువ విత్తనాలని నాటుతారు.

"ప్రపంచం లేదా మనుషులు మీ ఆధీనంలో ఉండాలని, మీరు కోరుకున్నట్లుగా అన్నీ జరగాలని మీరు అనుకుంటూంటారు. మీ తల్లి మీకు ఫలానా రోజుకి ఫలానా డ్రస్‌ని కొనివ్వాలి. మీ భర్త మీతో ఫలానా చోటికి మేరేజ్ ఏనివర్సరీకి తీసుకెళ్ళాలి. ఫలానా వ్యక్తి మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలి. మీకు బస్‌లో సీట్ దొరకాలి. మీ రైలు ఆలస్యం అవకూడదు. కాని ఇవన్నీ మీకు జరగవని మీకు అనుభవం మీద తెలిసిన విషయాలే. ఇన్నిటిలో ఒక్కటీ సఫలం కాకపోవచ్చు. అప్పుడు చెట్టుగా ఎదగని ఏపిల్ విత్తనాన్ని గుర్తుకి తెచ్చుకోండి. అప్పుడు మీరు ఎండలో నడవాలని

కోరుకున్నప్పుడు వర్షం వచ్చినా అశాంతిని పొందరు. ప్రపంచం మీకు అనుకూలంగా మారదు కాబట్టి మీరు దానికి అనుకూలంగా మారండి. మీ భాగస్వామి మోసం చేసాడా? సరే. ప్రతీవారు నిజాయితీపరులుగా ఉండాలని, మీ మిత్రులకి మీరు చేసిన సహాయాన్ని వారు గుర్తుంచుకుని కృతజ్ఞతగా ఉండాలని కోరుకుంటారు. కాని అవేవీ జరగవు. మీ ఆలోచనని, ఎదురు చూడటాన్ని మార్చుకోండి. కారణం దేవుడు అన్ని విత్తనాలని చెట్లగా మార్చదలచుకోనట్లే మీ జీవితంలోని అన్నీ ఫలించవు. దీన్ని మీ జీవితంలో అప్లై చేసుకుంటే మీకున్న చాలా బాధలు తొలగిపోతాయి. అప్పుడు నిరాశ మిమ్మల్ని వెంటాడి బాధించదు. తక్కువ ఆశించండి. తక్కువ ఎదురు చూడండి. మీ అభిప్రాయం మార్చుకుంటే, మీకు జరిగేది ఎలా స్వీకరిస్తారు అన్నది మీరు నిర్ణయించుకుంటే అప్పుడు మీకు అంతా ఆనందమే. జీవితం నిండా విచారం పరుచుకుని ఉంటుంది. కాని మనం దాన్ని ఎంతదాకా అనుమతిస్తే అంతవరకే అది వస్తుంది."

అప్పటికే జినేంద్ర ఆద్య మనసులోంచి క్రమక్రమంగా తొలుగుతున్నాడు. లా ఆఫ్ సీడ్ విన్నాక అతన్ని చెట్టవని ఏపిల్ గింజగా ఆద్య విస్మరించగలిగింది. సెరనీ పూర్తయ్యాక ఆద్య తను కొద్దిసేపట్లో ఇండియా వెళ్ళిపోతున్నానని, మర్నాటి నించి రానని చెప్పి పాస్టర్ దగ్గర శెలవు తీసుకుని ఇంటికి చేరుకుంది.'హైద్రాబాద్‌నించి వచ్చినప్పుడు ఆద్యని విమానాశ్రయంలో పికప్ చేసిన సైమన్ పావుగంట తరవాత బండిని తెచ్చాడు.

"మా చెల్లెలు గుడ్ బై చెప్పాల్సిన సమయం వచ్చింది మిస్టర్ డేనియల్." సామాను బండిలో పెట్టాక చైత్ర గార్డ్ డ్యూటీలో ఉన్న డేనియల్‌కి చెప్పింది.

"గుడ్ బై అండ్ థాంక్స్ మిస్టర్ డేనియల్." ఆద్య అతనితో కరచాలనం చేసి చెప్పింది.

"బై మిస్ ఆధ్యా. హేపీ జర్నీ అండ్ సేఫ్ లేండింగ్." అతను చిరునవ్వుతో చెప్పాడు.

"అలెగ్జాండర్ని, ఎబనేజర్‌ని గుర్తుచేసుకున్నానని చెప్పండి. నా తరపున వీడ్కోలు చెప్పండి." కోరింది.

ఖాలెద్, అక్కచెల్లెళ్ళిద్దరూ బండి ఎక్కారు. పావుగంటలో విమానాశ్రయానికి చేరుకున్నారు. "థాంక్స్ సైమన్." ఆద్య బండి దిగాక అతనితో కరచాలనం చేస్తూ చెప్పింది.

"హేపీ జర్నీ ఆద్యా!" సైమన్ నవ్వుతూ చెప్పాడు.

అంతదాకా మాట్లాడలేదు కాబట్టి విమానాశ్రయంలో తనని అక్క జినేంద్ర గురించి అడుగుతుందని ఆద్య ఎదురుచూసింది. కాని చైత్ర ఆ ప్రస్థావనే తేలేదు.

"నన్ను పిలవడం మంచిదైంది అక్కా. నేను ఇక్కడ చాలా నేర్చుకున్నాను." చెప్పింది.

"ఏం నేర్చుకున్నావు?" చైత్ర నవ్వుతూ అడిగింది.

"ఈ మూడు వారాల్లో నా పాత వర్షన్‌ని డిలీట్ చేసేసానక్కా. అది ఎక్స్‌పైర్ అయిపోయింది." చెప్పింది.

"గ్లాడ్."

"ఇక్కడ ముఖ్యంగా కొత్తవి నేర్చుకోవడంలోని ఆనందాన్ని నేర్చుకున్నాను. దాన్లోని అందం, నేర్చుకున్న వాటిని మననించి ఎవరూ ఎప్పటికీ కొట్టేయలేరు."

"గ్లాడ్. టిక్కెట్‌కి నేను ఖర్చు చేసిన పన్నెండు వందల తొంభై తొమ్మిది డాలర్స్ వృధాకానందుకు సంతోషంగా ఉంది. నేనూ ఒకప్పుడు నీలానే అదే భావజాలంతో, అదే పరిధిలో ఉండేదాన్ని. కాని అంతర్జాతీయ కంపెనీలో, అనేక దేశాలవారి మధ్య, అనేక దేశాల్లో పనిచేయబట్టి నా పరిధి పెరిగి చాలా నేర్చుకున్నాను. ఇది నమ్ము. మనిషి ఎదిగే ప్రయత్నం చెయ్యాలి. నిజానికి ప్రతీ మనిషీ నిత్యం ఎదుగుతూ తన పరిధిని విశాలం చేసుకుంటూండాలి." చైత్ర నవ్వుతూ చెప్పింది.

"అవును. మన దేశంలో చాలామంది అక్కడే ఆగిపోతూంటారని ఇక్కడికి వచ్చాక కాని అర్థం కాలేదు."

"గుడ్ బై." ఖాలెద్‌ని, చైత్రని హగ్ చేసుకుని చెప్పింది.

"ఇది నీ మొదటి విదేశీయాత్ర కదా? నువ్వు ఇక్కడ ఏం నేర్చుకున్నావు?" ఖాలెద్ అడిగాడు.

"సిరియా, రష్యా నాకు నేర్పిన పాఠం, ప్రజలు తిండి, బట్ట, గూడులాంటి ప్రాధమిక అవసరాలని కోల్పోతేనే తిరుగుబాటు చేస్తారని. మరోవర్గం వారి అనచివేతవల్ల సామాజిక స్వేచ్ఛ కోల్పోయినా. జీవితంలో దేనికి ప్రాముఖ్యత ఇవ్వాలో, దేనికి ఇవ్వకూడదో కూడా ఈ ట్రిప్‌లో నేర్చుకున్నాను. ప్రపంచం మనకి చాలా మాస్క్‌లని తొడుగుతుంది. ఆనందం, విచారం, అహం, చెడ్డతనమింకా ఎన్నో. వాటిని ధరించకుండా మన అసలు మొహాన్ని మనం కాపాడుకోవాలి అని తెలుసుకున్నాను."

ఫక్కున నవ్వాడు.

"మతం, కులం, లింగం, విద్య, సోషల్ స్టేటస్, సంపద, భాష, చర్మం రంగు, దేశం లాంటి వాటివల్ల ప్రభావితం అవకూడదని వాటిని బట్టి మనుషుల్ని జడ్జ్ చెయ్యకూడదని నేర్చుకున్నాను." ఆద్య జవాబు చెప్పింది.

"వెరీ నైస్. వికాసమే జీవితం. సంకుచితత్వమే మరణం. చిన్న వయసులోనే ఓపెన్ మైండెడ్ అవడం గొప్ప సంగతి." ఖాలెద్ అభినందించాడు.

విమానంలో పదకొండుమందే ఉన్నారు. ఇద్దరే తెల్లవాళ్ళు. మిగిలినవారంతా నల్లవారు. గత పన్నెండు రోజుల్లో జరిగిన అనేక సంఘటనలని ఆమె నెమరు వేసుకుంది. పాప ఏడ్చి నిద్రపోవడానికి ఎండు మిరపకాయ తినిపించిన బామ్మ, చర్చ్ ఫాదర్లకి అమ్మాయిలని సేవకి అప్పచెప్పే ట్రోకోసి సంప్రదాయం, బాల్టిక్ మానవహారం, కేప్ కోస్ట్ కేజిల్‌లోని డంజన్, సూడాన్‌లో క్షామం వల్ల మరణించిన లక్షలాదిమంది, ఆకుల్ని ఉడకపెట్టుకుని జీవించడానికి ఆ నీళ్ళు తాగడం, సిరియానించి నాటు పడవలో పారిపోయి సముద్రం పాలైన ప్రజలు, తీరంలో లభించిన మూడేళ్ళ అలన్ కుర్ది శవం, చర్చ్‌లో తను విన్న ప్రవచనాలు... ఇంకా ఎన్నో గుర్తొచ్చాయి. ఇలాంటి కష్టాలేమీ ఎరగని దేశంలోని తను ప్రేమ వైఫల్యాన్ని

పెద్ద కష్టంగా భావించినందుకు సిగ్గుపడింది. అదే సమయంలో నవ్వుకూడా వచ్చింది. విమానం గాల్లోకి లేస్తూంటే ఆద్య కిందకి చూస్తూ మనసులో అనుకుంది.

'థాంక్యూ టకరోడీ! హైదరాబాద్ నేర్పని చాలా నువ్వు నేర్పి పంపుతున్నందుకు థాంక్స్. నానించి అధైర్యాన్ని, నిరాశని తీసుకుని ఆత్మస్థైర్యాన్ని ఇచ్చావు.'

విమానం ఆక్రాకి చేరుకుంటుండగా బి.బి.సిలో చూసిన ఓ డాక్యుమెంటరీలోని 'స్టామ్ ఆఫ్ ది సెంచురీ' ఆద్యకి గుర్తొచ్చింది. వేలమంది ఆధారపడ్డ ష్రింపింగ్ వ్యాపారాన్ని ఆ తీవ్ర తుఫాను నాశనం చేసింది. చాలా పడవలు కొట్టుకుపోయాయి. కాని ఆ తర్వాత ఓ మంచి జరిగింది. మత్స్యకారులు వెళ్ళలేని సముద్రం అడుగుభాగంలోని ష్రింప్ చేపలన్నీ పైకి వచ్చాయి. అవి ఇంకా లాభం తెచ్చే విలువైన ష్రింప్ చేపలు. ప్రకృతి ఏదీ ఉచితంగా తీసుకోదు. ఒకటిచ్చి ఒకటి తీసుకుంటుంది. తన జీవితంలో కూడా స్టామ్ ఆఫ్ ది లైఫ్ వచ్చింది. తీవ్ర నష్టం వాటిల్లింది అనుకుంది. కాని నిజానికి ఆ తుఫాను మంచికే వచ్చిందని టకరోడీలో ఎన్నో విషయాల ద్వారా తనకి తెలిసింది.

ఆఫ్రికాలోని కొటోక ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకున్నాక ఆద్య లగేజ్ చెకిన్ చేసాక టైముండటంతో బయటకి వచ్చింది. ట్రాఫిక్ ఐలండ్‌లో ఆరుగురి బస్ట్ సైజ్ విగ్రహం చూసి దారిన పోయేవారిని ఆసక్తిగా అడిగింది.

"వాళ్ళు ఎవరు?"

"గ్రేట్ సిక్స్. ఘానా స్వతంత్రంకోసం పోరాడినవారు."

ఇంటికి వెళ్ళాక గూగుల్ చేసి వాళ్ళ గురించి తెలుసుకోవాలని గుర్తుపెట్టుకుంది. తర్వాతి విమానం కోసం ఎదురు చూసేప్పుడు క్రిస్‌నించి వచ్చిన వీడియోని చూసింది. 'పిక్చర్ ది కంట్రీ' గేమ్ వీడియో అది. ఆ పావుగంట వీడియోని చూస్తూ తెగ నవ్వుకుంది. కొందరు ఆమెవంక చూసారు కూడా.

గంటం పావు తర్వాత ఆడిస్ అబాబా విమానం ఎక్కింది. మధ్యాహ్నం 12.20కి ఆ ఇథోపియన్ నాన్ – స్టాప్ ఫ్లైట్ నంబర్ ఇటి 920 ఆక్రానించి బయలుదేరి ఆడిస్ అబాబాకి చేరుకుంది. అక్కడనించి మళ్ళీ ఫ్లైట్ మారి నాలుగువేల ఐదు వందల ఏభై ఏడు కిలోమీటర్ల దూరంలోని న్యూఢిల్లీకి ఐదు గంటల నలభై నిమిషాల తర్వాత చేరుకుంది.

విమానంలోంచి కనపడే భారత భూభాగాన్ని చూస్తూ మనసులో అనుకుంది. 'ఎంత మంచి, భద్రమైన దేశంలో పుట్టాను!; ఇమిగ్రేషన్ క్యూలో పనయ్యాక బయటకి నడిచింది.

ఢిల్లీ ఏర్‌పోర్ట్‌లోని సౌత్ ఇండియన్ రెస్టరెంట్ వాంగోలో బ్రేక్‌ఫాస్ట్ చేసి అక్కడనించి హైద్రాబాద్‌కి ఏర్ ఇండియా ఫ్లైట్‌లో ఇమిగ్రేషన్ క్యూలో పనయ్యాక బయటకి నడిచింది.

ఢిల్లీ ఏర్‌పోర్ట్‌లోని సౌత్ ఇండియన్ రెస్టరెంట్ వాంగోలో బ్రేక్‌ఫాస్ట్ చేసి అక్కడనించి హైద్రాబాద్‌కి ఏర్ ఇండియా ఫ్లైట్‌లో చేరుకుంది.

ఆమె శరీరం అలసినా మనసు ఎంతో ఆహ్లాదంగా ఉంది.

విషాదం నించి ఆమె చేసిన ప్రయాణం ఆనందంతో ముగిసింది.

తల్లిదండ్రులు ఆమెని రిసీవ్ చేసుకోడానికి వచ్చారు. దూరంగా వచ్చే కూతురి మొహంలోని చిరునవ్వుని చూసి ప్రవర్ధన తన బర్త సంజీవతో ఆనందంగా చెప్పింది.

"ఏడుపుని ఆఫ్రికాలో వదిలి వస్తోంది."

ఆద్య వారి మొహాల్లోని ఆనందాన్ని చూసింది.

"అమ్మయ్య! ఎంత కాలానికి నీ మొహంలో నవ్వుని చూస్తున్నాను." కూతుర్ని కౌగలించుకుని ప్రవర్ధన చెప్పింది.

"ఎందుకంటే నేను కొత్త నేనుగా వచ్చాను మరి." ఆద్య చిరునవ్వుతో చెప్పింది.

పార్కింగ్‌కి వెళ్ళి కారులో ఇంటికి బయలుదేరారు.

"ముందు చైత్రకి ఫోన్ చేసి ఆద్య జాగ్రత్తగా చేరిందని చెప్పండి." సంజీవి కారు స్టాట్ చేసేముందు ప్రవర్ధన సూచించింది. ఆయన ఫోన్ చేయగానే చైత్ర ఆన్సర్ చేసింది.

"మీ ఫోన్ కోసమే వెయిట్ చేస్తున్నాను. విమానం లేండై నలభై నిమిషాలైంది. క్షేమంగా చేరింది కదా?"

"చేరింది."

"అక్క పంపిన బహుమతులు పెట్టెలో ఉన్నాయి. చూడమ్మా." ఇంటికి చేరుకున్నాక ఆద్య బాత్‌రూంలోకి వెళ్ళేముందు ఆద్య సూచించింది.

ఆమె స్నానానికి వెళ్ళగానే ఆ పెట్టె తెరిచిన ప్రవర్ధనకి తమకి చైత్ర పంపిన గిఫ్ట్‌లతోపాటు 'సర్‌ప్రైజ్ గిఫ్ట్ టు డాలీ' అని రాసిన ఓ చిన్న అట్టపెట్టె కనిపించింది. స్నానం చేసి వచ్చిన ఆద్యకి దాన్ని చూపించింది. ఆమె దాన్ని తెరిచి అందులోంచి ఓ వస్తువుని తీసింది.

అది బంగారు గీతలున్న ఓ పింగాణీ పాత్ర. దాన్లో ఇంగ్లీష్‌లో జపనీస్, ఇంగ్లీష్, ఫ్రెంచ్ భాషల్లో అచ్చేసిన కాగితంలో ఇలా ఉంది.

'ఏదైనా పగిలినా అందులోంచి అందం రావచ్చు. జపాన్‌లో పింగాణీ పాత్ర పగిలితే ముక్కలని బంగారంతో అతికిస్తారు. అప్పుడు మెరిసే లైనింగ్‌తో ఆ పాత్ర మునుపటికన్నా అందంగా కనిపిస్తుంది. మనిషి హృదయానికి కూడా ఇదే వర్తిస్తుంది. కష్టాలవల్ల మనిషి జీవితం అందవికారంగా మారినట్లు కనిపించినా, ఆ కష్టాలవల్ల ఏర్పడ్డ హృద్యంలోని పగుళ్ళని బంగారంలాంటి దేంతోనైనా మళ్ళీ మరమ్మత్తు చేయచ్చు. ఏ పగిలిన హృదయం మరమ్మత్తుకి అతీతం కాదు. నీ హృదయంలోని సంఘర్షణల తాలూకు మచ్చలని నువ్వు గౌరవ పతకాలుగా భావించు.'

ఆద్య దాన్ని ముద్దుపెట్టుకుని జాగ్రత్తగా షోకేస్‌లో పెట్టింది.

ఆద్య ఆ రాత్రి తను చూసిన, తెలుసుకున్న చాలా విషయాలని చెప్పింది. కొన్ని ఇద్దరి హృదయాలని బరువెక్కించాయి.

పడుకున్నాక ప్రవర్ధన సంజీవతో ఆనందంగా చెప్పింది.

"అది పూర్తిగా తేరుకుందండి. చైత్రకి ఫోన్ చేసి చెప్పండి."

వెంటనే ఆయన చైత్రకి ఫోన్ చేసాడు.

"పనామా కాలువ...కల్నల్ గోథల్స్.. విమర్శలకి అతనిచ్చిన సమాధానం.. ఆయనలా నువ్వు పనిని పూర్తిచేసి సమాధానం చెప్పావు. థాంక్స్ తల్లీ."

"నేను చేసిందేం లేదు నాన్నా. దాని మనసు సరైన దారిలోకి మళ్ళించేవాటిని అందుబాటులో ఉంచడమే నేను చేసింది. ఇలాంటివి అందుబాటులో ఉంటే మనిషి దృక్పథం విశాలమై, వారి ఎంతటి గడ్డు సమస్య అయినా తేలికవుతుంది." చైత్ర చెప్పింది.

ప్రయాణం బడలిక తీరాక మర్నాడు ఆద్య తన ఫోన్ సెల్యులర్ని ఆన్ చేసింది. చాలా మెసేజెస్ వచ్చాయి. వాటిలో ఒకటి జినేంద్రనించి.

'నీతో అర్జెంట్‌గా మాట్లాడాలి బేబ్స్.'

అది రెండు రోజుల క్రితం పంపిన మెసేజ్.

కొందర్ని జీవితంలోంచి బ్లాక్ చెయ్యాలి. అన్‌సబ్స్‌క్రైబ్ చెయ్యాలి. డిలీట్ చెయ్యాలి.

'నేను ఆఫ్‌లైన్, తూలిక ఆన్‌లైన్ కాగానే యు ఆర్ డిలీటెడ్. శుభం' టైప్ చేసి జవాబు పంపి, ఆద్య అతని నంబర్ని బ్లాక్ చేసి తన ఫోన్‌లోంచి దాన్ని తొలగించింది.

(సమాప్తం)

Post your comments

ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి

www.anandbooks.com
www.telugubooks.in